# నిరభిమానులు కోరేది కులాభిమానం

పెళ్ళి బాజా లాగిపోయాయి. అతిథుల చెవుల గింగుర్లు తగ్గిపోయాయి చిన్నగా కలకలం బయలుదేరింది. పీటల మీద కూర్చున్న కాబోయే దంపతులు పిడుగుపడ్డట్టుగా చూస్తున్నారు, ఈటెల్లాంటి మాటలు వదులుతున్నాడు పెళ్ళికొడుకు తండ్రి ఈశ్వరయ్య. ఈశ్వరయ్యకు ఈశ్వరుడన్నా లెక్కలేదు, ఐశ్వర్యం ప్రధానం. ఈ సంగతి తెలియని పెళ్ళి పిల్ల తండ్రి సినిమా నాగయ్యలా 'ఇయ్యాల్సిన డబ్బు సమయాని కందలేదు మీరు' అని ప్రాధేయపడుతున్నాడు. నేనప్పుడే అనుకున్నాను నీ పుల్లటి మొగం చూసి ఇలాంటి దేదో అడ్డు వేస్తావని. అయినా కట్నం విషయంలో నేను యెంత ఖచ్చితంగా ఉంటానోనన్న సంగతి నేను చేసిన నా మొదటి ఇద్దరి కొడుకుల పెళ్ళిళ్ళలో నిరూపించాను. నీ చెవిలో పడిందో లేదోనని ఒకటికి నాలుగు సార్లు ఆ పెళ్ళిళ్ళ పేరయ్యతోకూడా చెప్పించానే ఆ మాత్రం బుర్ర కెక్కించుకోలేని మంద బుద్ధివి, 'నీ కూతురు నాకక్కర్లేదు వెళ్ళు' అంటూ ఈశ్వరయ్య ఉగ్రేశ్వరుడై కొడుకు వైపు సైగ చేస్తూ మరీ కదిలినాడు.

'బావగారూ! చచ్చి నీ కడుపున పుడతా గాని కార్యం ఒడ్డెక్కించండి మీ ఋణంలో యెన్నటికీ పోను పైకం అందుతే రేపే ముట్టజెబుతాను' అని ఆ పిల్ల తండ్రి పరిపరివిధాలా ప్రార్థించాడు. ఈశ్వరయ్య గుండె ఇనుప ముక్క అన్న సంగతి తెలియక.

'అయ్యా నీ వేషమే వద్దంటుంటే, నేను కొత్త చీర కట్టుకొస్తానన్నట్టు, నీతో సంబంధమే వద్దంటుంటే చచ్చి నా...కడుపున పుడతానంటా వేమిటి?' అని ఓ నాగభూషణం డైలాగు వదిలి ఇంకా పీటల మీది నుండి కదలడం లేని కొడుకును కళ్ళెర్ర జేసి చూచాడు.

పెళ్ళి కొడుకు గుండెల్లో తండ్రంటే గూడు కట్టుకున్న భయం వెల్లువలా పొంగిరావడంతో లేవాలనుకున్నాడు. పసుపురాసుకున్న బుగ్గల పై నుండి కన్నీరు కారుస్తున్న వధువును చూస్తుంటే అలాగే కూర్చుండాలనుకున్నాడు. ఏదో ఒక నిర్ణయానికి రావాలనుకునే సరికి రెంటిమధ్య సంఘర్షణ మొదలైంది. అందులో మొదటిదే పై చేయి చేసుకుంది. బరువుగా లేచి బంధం విడపించుకుని బాధగా నడిచాడు. ఒక్క మాటకూడా తండ్రి నెదిరించే ధైర్యం లేని పెళ్ళి కొడుకును అక్కడ ఎవరూ ఆపలేకపోయారు. కొంతముందుకు నడిచాక గుంపులో నుండి నలుగురు పెద్ద మనుషులు సాహసించి ఈశ్వరయ్యను వేడుకున్నారు. ఆయన లొంగే బాపతు కాదని తెలిసిన కొందరు పెళ్ళి కొడుకును వెనక్కు లాగుతున్నారు. అ పితృ విధేయుడు 'మీరు నాన్నతోనే మాట్లాడుకోండి నేనేం చేయగలవాన్ని' అంటున్నాడు. ఆ మాటలకు వరుని తరపునే పెళ్ళికి వచ్చిన ప్రకాశం భగ్గున మండి పోయాడు. తమాయించుకుని స్నేహితున్ని సమీపించి 'వోరేయ్ ఇది న్యాయం కాదురా!' అన్నాడు బతిమాలుతున్నట్టు.

---

పాతల్లుడి ముఖం పాత చింతకాయ పచ్చడిలాగుంది. కొత్తల్లుడికి ఏమైనా కొనిస్తారేమో, తనకీ ఏదైనా ఛాన్స్ తగులుతుందేమో అనుకున్నాడు. 'కథ' అడ్డం తిరిగింది. 'డామిట్' అకలి. అత్తగారు చేసిన పిండి వంటలు జ్ఞాపకం వచ్చాయి.

సాధారణంగా అల్లుళ్ళు మామగారి తాహతును గుర్తించరేమో? (అందరూ అలా ఉంటారని నేననడం లేదండోయ్) ఏదైనా తమదాకా రావాలి కదా మరి. తాహతునిమించి గొంతెమ్మ కోర్కెలు పనికిరావు.

'న్యాయం గురించి నువ్వేందోయ్ వానికి గుర్తుచేసేది, మా బాగా తెలుసు మాకా సంగతి' అన్నాడు ఈశ్వరయ్య కొడుకును మాటాడనీయకుండానే.

ప్రకాశం బెదరి పోలేదు 'ఆడబిడ్డకు మీరే తండ్రైతే తెలిసేది'

'అభిమానం ఉన్నవాడికి ఆడదైతేనేం మగవాడైతేనేం ఉన్నరివాజులు చేసి తీరే వాన్నే.'

మళ్ళీ ప్రకాశం పెళ్ళికొడుకు వైపు తిరిగాడు కాని లాభం లేదు. 'వొరేయ్ నువ్వే నా పరిస్థితుల్లో ఉంటే' ఇంతకన్నా యేంచేసే వాడివిరా' అంటున్నాడు స్నేహితుని నోరు మూయించాలని.

'యెవరడ్డమైనా తప్పక పెళ్ళి చేసుకునే వాన్నే' అన్నాడు ప్రకాశం గంభీరంగా.

'ఇప్పుడు మాత్రం యేం మునిగి పోయింది అ పిల్లను నువ్వేకట్టుకోరాదూ!' అన్నాడు ఈశ్వరయ్య. ఆయన మాటలకు అక్కడి వారంతా ముక్కు మీద వేలేసుకున్నారు.

ప్రకాశం స్తబ్దుడై పోయాడు పెళ్ళి చేసుకునేందుకు భయపడికాదు ఈశ్వరయ్య లాంటి వాడు అంత మాట అన్నందుకు.

'నేను అనాల్సిన మాట మీరే అన్నారు' తప్పకుండా చేసుకుంటాను. ఆ పిల్లనే పెళ్ళి చేసుకుని మీ అట కట్టిస్తాను.

ఈసారి అతిథులు మరింత ఆశ్చర్యానికి గురయ్యారు. కొందరు ముక్కుపై వేలేసుకున్నారు. మరి కొందరి హాహా కారాలింకా వినపిస్తూనే ఉన్నాయి. అందరికన్నా పెళ్ళి పిల్ల తండ్రి అత్యాశ్చర్యంలో మునిగిఉన్నాడు. ఆయన మొగంలో ఈశ్వరయ్య కాదన్నప్పటి దీనత్వంస్థానే ఇపుడు కోపం తావు చేసుకుంటుంది. పీటలమీద నుండి లేచిన పెళ్ళికొడుకు బలహీనతకన్నా ఈశ్వరయ్య యీసడింపుకన్నా, ఉదార బుద్ధితో తన హృదయ వైశాల్యాన్ని రుజువు చేసుకోడానికి ముందుకు వచ్చిన ప్రకాశం మంచితనం ఆయనకు కంఠగింపుగా తోచింది. పీటల మీది పెళ్ళిని కాలదన్నినపుడు, తండ్రీ కొడుకులపై కనబరచిన ఏవగింపు, నిస్వార్థంగా ఒక ఆదర్శంకోసం ముందుకు వచ్చిన ప్రకాశంపై కలిగింది.

'ఓ కులమూ తెలువదూ! గోత్రమూ తెలువదు! నా కూతుర్ను నలుగుట్లో పెళ్ళి చేసుకుంటానంటావట్రా' అంటూ కస్సున లేచాడు. ఒక్క కులంముందూ గోత్రం ముందు అవమానాలు నిరభిమానాలు అన్నీ దిగదుడుపే ననుకున్నాడు. నలుగుట్లో తన్నూతన అభిమానాన్ని, పరువూ ప్రతిష్టల్నీ కాలరాచిన ఈశ్వరయ్య పాదధూళినైనా కళ్ల కద్దుకోడానికి సిద్ధపడ్డవాడు, ప్రకాశం పిలుపును తలవంపుగా భావించకేం చేస్తాడు. ఆ తలవంపును పోగొట్టుకోటానికి, తన తీవ్రకులాభిమానాన్ని ప్రకటించుకోడానికి, ఆ తండ్రి తన కూతురు పెళ్ళి జరిగేట్టు చూడడానికి తన ఇల్లు కుదువ బెట్టుకోమని ఈశ్వరయనే అర్థించి వెళ్ళాడు కాని ప్రకాశం వైపు మొగమెత్తికూడా చూడలేదు.

—శ్రీ వేముల ప్రభాకరుడు.

---

(22వ పేజీ తరువాయి)

ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. నాముఖం చూడటానికికూడ అంత అసహ్యమేస్తుందా? లేదు రమా, నేను నా స్వార్థంకోసం ఆపరేషన్ చేయించుకో లేదండీ. మనకోసం, మన సంసారంకోసం, మన పిల్లల భవిష్యత్తుకోసం చేశానండి. కాని భగవంతుడు నా ఊహలను చెరిపేస్తాడని అనుకోలేదండి. నా ఆలోచనలు మన బాబుని, మనవంశంకురాన్ని బలితీసుకుంటాడనుకోలేదు.

బాబు బదులు భగవంతుడు నన్ను తీసుకెళ్ళినా బాగుండేది అంటూ మధు కాళ్ళపైబడి బావురుమంది. రమా నీమీద నాకేం కోపంలేదు. బాబు మరణం నా హృదయాన్ని కోస్తుంది. అందుకే నే నెవ్వరితోను సరిగా మాట్లాడటంలేదు. నువ్వలాంటి మాటలనకు. నేనే కారణమని నువ్వనుకోకు. విధి లిఖితాన్ని ఎవరుమాత్రం ఒప్పించగలరు అంటూ రమను లేవదీసి హృదయానికి హత్తుకున్నాడు. మధు హృదయంపై వాలి కళ్లు మూసుకుంది రమ.